భగవద్భక్తి

"ఏమండీ ? మనింటోకూడా ప్రతిరోజూ భజన చేసుకుందాం?" అన్నది నా భార్య. ఇప్పుడెవరింటో చేసుకుంటున్నారేమిటి?" అన్నాను చదువుతున్న పుస్తకం పూతపెట్టి. మాది చాలా అన్యోన్య దాంపత్యం. రోజూ కీచులాడుకునే భార్యాభర్తలకు ఒక్కరోజయినా అన్యోన్యంగా ఉందామని ఉండటం సహజం. నాకుమటుకు ఏవంక పెట్టుకుని మా రాజీలో కీచులాడుదామా అని ఉంటుంది. అదృష్టవశాత్తూ ఇప్పుడు నాకు దొరకవలసిన విషయం దొరికింది—దేవుడు !

నా భార్యకు నామీద అపారమైన ప్రేమ ఉందనటానికి ఎటువంటి సందేహమూ లేదు. నలుగురు పిల్లల్ని కనికూడా అన్నివిదాల కంటిని రెప్పలాగా కనిపెట్టి ఉండటమే కాక నామీద తనకు పెంచిన మోహముట—అంటుంది మా రాజీ ! తన పిల్లలంతా పళ్ళేటగాని, నావంటి ముంతమామిడి పళ్ళు కారుట! ఇదంతా నేను లేకితనం కొద్దీ చెప్పుకుంటున్నా ననుకోవద్దు. నేనంటే అంత మమత ఉన్నా మా రాజీకి నన్ను చూస్తే ఒకందుకు అలుసు—నేను నాస్తికుణ్ణిట ! నా వైపు వాళ్ళంతా నాస్తికులేట ! తనూ తన తల్లిదండ్రులూ, తన అన్నలూ పరమ భాగవతోత్తములుట !

మా వైపు వాళ్ళంతా నాస్తికులని నేను ఒప్పుకున్నాను. మా నాన్న దేవుడి పేరు చెప్పి కానీ ఖర్చు చెయ్యవలసి వస్తే, "ఆఁ! భగవంతుడు తిరపతిలోనే ఉన్నాడా ఏమిటి? ఇక్కడలేడూ ? గుళ్ళోకి పోయి కొబ్బరికాయలు కొడితేనే సంతోషిస్తాడా ఏమిటి ?ఇంట్లోనే బెల్లంముక్క నైవేద్యంచేస్తే సంతోషించడూ?" అని తప్పించుకో జూచేవాడు. మా అమ్మ ఈనాటికి కూడా ఒక పురాణంగాని, హరికథగాని, భాగోతం గాని, ఏమిటో ఎరగదు. అటువంటి వాటికి తీరిక లేదు. ఆవిడకు తీరినా ఆవిడ కవి అర్థం కానూకావూ, బాగానూ ఉండవూ ! ఇక నేను ఉండనే ఉన్నాను, నా భార్య అన్నట్టు, ఆవలించి అయినా "అబ్బ ! శ్రీరామచంద్రా !" అనుకోని పరమ నాస్తికుణ్ణి!

ఎటొచ్చీ నా భార్యే అంగీకరించదు, తన వారంతా ఆస్తికులై మాకంటె వెలగ బెట్టిందేమీ లేదని. మా మామగారు అపర రామదాసు. ఆయన ఇప్పుడు రెండవ రామకోటి రాస్తున్నాడు. భద్రాచలంలో ఆయన్ని ఎరగని వారు లేరని ఆయనే చెప్పుకుంటాడు. గనక నిజమే అయి ఉండాలి? మా పెద్ద బావమరిది బైరాగి ముండా కొడుకై తిరుగుతూ, పెళ్ళీపెటాకులూ లేకుండా, గంజాయి గాళ్ళ దగ్గిర చేరినా వాడి నోటివెంట వేదాంతం తప్పరాదు. మధ్య మధ్య తనే ఆ యొక్క

విరాట్స్వరూపం అనే భ్రమలోపడి అందర్నీ హైరాన పెడుతూ ఉంటాడు కూడానూ. ఇక మా రెండో బావమరిది భజనలు చెయ్యటానికి ప్రసిద్ధి. వాడు లేని భజనలూ సప్తాహాలూ ఉండవు. మా ప్రాంతాల అసలు భజన తంతు వాడికి తెలిసినట్లు మరొకరికి తెలియదుట. (భజన కొక తంతుకూడా ఉందని నా అంతట నేను ఊహించగలిగి అయినా ఉండను.). మా రెండో అబ్బాయి ముఖ్యంగా తరంగాలు పాడటంలో నిధి. బాల గోపాల తరంగం[1] ఆ వెల్లటూరాయన[2] పాడితేనే వినాలి. మళ్ళీ మా దావమరిది పాడితేనే వినాలి అని ఒక అభిప్రాయం వుంది కొంత మందిలో.

పోతే మా అత్తగారు! ఆవిడ కాపరానికి వచ్చిన చాలా సంవత్సరాల వరకు ఏమీ ఎరగని దానల్లే ఉండి ఉండి అకస్మాత్తుగా ఒకనాడు తనే అందరికన్నా తలపన్నిన భక్తురాలని రుజువు చేసుకున్నది. సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రమూర్తి ఆవిడ వంటిమీదికి వచ్చాడు అది కొంచెం వివరంగా చెప్పవలసిన కథ.

మా మామగారు మొదట రామకోటి పూర్తిచేస్తూ ఉండిన రోజులవి. ఆ రోజుల్లో మా అత్తగారికి ఒంటో సరిగా ఉండటంలేదు. ఈ బ్రాహ్మడేమో భోజనాల ముందర రామకోటి పెట్టుకుని రెండుజాములదాకా వడ్డనకు అనుజ్ఞ ఇచ్చేవాడు కాడు.

ఒకనా డిట్లాగే మా మామగారు రామకోటి రాసుకుంటున్నాడు. మా అత్తగారు ఆయనకు ఎదురుగా గోడకు చేరగిలబడి కూర్చుని, "దబ్బున కానిస్తురా! నా ప్రాణం పోతున్నదీ!" అని అంటున్నది. ఇంత దైవచింతన లేని భార్యను తనకు అంటగట్టటంలో భగవంతుడి ఉద్దేశం ఏమై ఉంటుందా అని ఆశ్చర్యపడుతూ మా మామగారు రామకోటి రాస్తూండగా, నిస్త్రాణగా కూర్చుని ఉండిన మా అత్తగారు చప్పున నిలుక్కుపోవటం ఆయన కళ్ళ పడింది.

"అమ్మాయి! ఒసే, మీ అమ్మకు పైత్యపు దడ వచ్చినట్టుంది. ఒకసారి ఇట్టరావే!" అని ఆయన కూతుర్ని కేక పెట్టాడు.

మా అత్తగారు కోపంతో చలించి పోతున్నదానల్లే కంపిస్తూ, భయంకరమైన కళ్ళతో భర్తవంక చూస్తూ, "నాకు పైత్యమంటావుట్రా? చూడు, నిన్నేం చేస్తానో! పెట్టు నాకు హారం పెట్టు! పెడతావా లేదా!" అని పెడబొబ్బలు పెట్టింది.

నా భార్య— అప్పటికింకా నాకు పెళ్ళి కాలేదు; పసిది — తండ్రి కేక విని పరిగెత్తుకుంటూ వచ్చి, తల్లి పెడ బొబ్బలకు నిర్ఘాంతపోయి వణుకుతూ అట్లాగే

---

1. బాలగోపాల తరంగం : కూచిపూడి భాగవతులు ప్రదర్శించే నారాయణ తీర్థుల బాలగోపాల తరంగాలు.
2. వెల్లటూరాయన : చూడండి పశ్చాత్తప్తుడు కథ.

నిలబడ్డది. ఇదంతా ఇట్లా ఎప్పుడు జరుగుతుందా అని కనిపెట్టుకున్న వాళ్ళల్లే పొరుగింటి పుల్లమ్మా, ఎల్లమ్మా అక్కడ మరుక్షణంలో హాజరయినారు.

"త్రిపురమ్మకు పూనింది!" అన్నది పుల్లమ్మ, వెంటనే జరిగిందంతా అర్థం చేసుకుని.

"అపరాధం అనవయ్యో, పిచ్చి బ్రాహ్మడా ! నువ్వు రామకోటి రాస్తున్నావాయెనూ! మరి దానికి శాంతి వద్దూ? మొక్కుకో — సంతర్పణ చేస్తానని మొక్కుకో!" అన్నది ఎల్లమ్మ.

"ఓహో, ఇదా సంగతి?" అన్నట్టు మా మామగారు అక్కడ ఉన్నవారిమీద ఒక చిరునవ్వు ప్రసరింపజేసి, భార్యవంక తిరిగి, "నాకామాత్రం తెలియదా, స్వామీ! నీ కోటి పూర్తి కాగానే భద్రాచలం రానా? నిన్ను దర్శించనా? వైభవంగా సంతర్పణ చెయ్యనా- వెయ్యి బ్రాహ్మణ్యానికి?" అని మృదువుగా తన భార్య వంటిమీదికి వచ్చిన శ్రీరామచంద్రమూర్తిని మందలించాడు. ఆయన మాటల ధోరణి చూస్తే ఆ యొక్క శ్రీరామచంద్రమూర్తి ఈ మాత్రం తెలుసుకోలేనందుకు మా మామగారు ఆశ్చర్యపడ్డట్టూ, ఆ సారికి రామచంద్రుడి అజ్ఞానాన్ని తాను క్షమించినట్టూ కనపడ్డాడు. అయితే ఎదురుగా సాక్షాత్కరించిన శ్రీరామచంద్రమూర్తి, విగ్రహరూపంలో భద్రాచలంలో చూడటం ఎందుకో నాకర్థం కాలేదు!....అయినా నా మామగారివంటి భాగవతోత్తముడి ఉద్దేశాలను విమర్శించటానికి నేనెవణ్ని? నా భార్యా, మామగారూ స్వయంగా చెప్పిన సంగతులే ఇక్కడ రాస్తున్నానుగాని నేనేమీ కల్పించటం లేదు. ఊహించటం కూడా లేదు.

అట్లా ఊహించదలుచుకున్న వాణ్ణే అయితే, మా మామగారు మా అత్తగార్ని చూసి అసూయపడ్డట్టు ఊహించగలను. నిజానికి, చూడండి. పేరుపడ్డ రామదాసు మా మామగారు, రామకోటి రాస్తున్నది మా మామగారు, గడ్డాలూ మీసాలూ పెంచుకున్నది మా మామగారు, రామకోటి రాసినందుకు తద్దోష పరిహారార్థము సంతర్పణ చెయ్యబోతున్నది మా మామగారు! (రామకోటి రాయటానికి జ్యేష్ఠా నక్షత్రానికి చేసినంత శాంతి చెయ్యాలల్లే కనపడుతుంది మరి[1]) చివరకు ఆ రామచంద్రుల వారు మా అత్తగారి వంటిమీదికి వచ్చి ఆమెను పవిత్రం చెయ్యటమేమిటి ? ... ఇట్లా ఊహించగలను కాని నా ఊహ నిజమని నాకే నమ్మటానికి లేదు.

ఎందుకంటే—

పై కథ వినండి. ఆ నాటికి మా అత్తగారికి గుగ్గిలం పొగా పొడు వేసి, వళ్ళు తెలిసేటట్టు చేశారు ఎల్లమ్మా, పుల్లమ్మా. ఆ తరవాత ఆవిడను బావి దగ్గిరికి తీసుకుపోయి ఇన్ని బిందెలు తోడి ఆవిడకు స్నానం చేయించి వాళ్ళు వెళ్ళిపోయినారు.

---

1. జ్యేష్ఠా నక్షత్రానికి – : జ్యేష్ఠా నక్షత్రం దుష్టప్రభావంగల నక్షత్రమని జ్యోతిష్యం నమ్మేవాళ్ళ నమ్మకం.

కాని రెండు మూడు రోజులకు మా అత్తగారికి మళ్ళీ పూనింది. ఆవిడ మళ్ళీ "హారం! హారం!... నాకు హారం కావాలి!" అని పెడబొబ్బలు పెట్టింది.

మా మామగారీసారి రాముడికి కటీబిటీగా చెప్పేశాడు — "స్వామీ! నిన్ను నమ్మిన భక్తుల్ని నువ్విట్లా ఒత్తిడి చేస్తే ఎట్లా? నీకు శాంతి చేస్తానని నీకు నేను వాగ్దానం చేస్తినే! నీకు పరిస్థితులన్నీ తెలుసునే''

కాని మా అత్తగారు మట్టుకు తన ధోరణి మానలేదు.

''స్వామీ, నేను నీ భక్తుణ్ని. నువ్వు భక్తులకు దాసుడివి. నువ్వు నన్నేమీ చేయలేవు....ఇక సర్దుకోవాలి! లేకపోతే వీలులేదు!" అని మా మామగారు భార్య మీద ఎగిరి పడ్డాడు.

తరువాత అప్పుడప్పుడూ మా అత్తగారికి పూనుతూనే ఉండేది. మా మామ గారు "స్వామీ, సర్దుకోవాలి ఊఁ!'' అని రాముణ్ణి తొందర చేస్తూనే ఉండేవాడు.

నిరాకారుడైన శ్రీరాముడి యందు అంత భక్తి ప్రేమ విశ్వాసాలు కలిగి ఉండిన మా మామగారు, రాముడు ఏ క్షణాన సాక్షాత్కరించుతాడో, తన భార్య నోట ఏ క్షణాన పలుకుతాడో అని గడగడలాడి పోతుండేవాడు. రామచంద్ర మూర్తి తన యింటికి రావటం తన మంచికి కాదన్నట్టు ఆయన భావించే వాడని పిస్తుంది, ఆయన ప్రవర్తన చూస్తే. కాని భక్తుడికి అటువంటి మనస్తత్వం అసంభవం! అందుకనే అన్నాను భక్తుణ్ని విమర్శించేటందుకు నే నెవణ్ణని.

నా భార్యవైపు వాళ్ళను గురించి యింత వివరంగా చెప్పాను. రాతలో చెయ్యి తిరిగిన వాణ్ణి కావటం చేత నేను కొంత యుక్తి వినియోగించి, మా మామగారి కుటుంబాన్ని గురించి అంతా నిజమే రాసినప్పటికీ, మా వాళ్ళ నాస్తికత్వం కంటే నా భార్య వైపు వాళ్ళ ఆస్తికత్వం ఏమంత ఘనంగా లేదని వినేవాళ్ళకు అనిపించేటట్టు చేసి వుండవచ్చును. నా రచనకు వశులై ఎవ్వరూ నా వైపు వాళ్ళను శ్లాఘించవద్దు, నా భార్య వైపు వాళ్ళను నిరసించవద్దు.

ఏమంటే ఆస్తికత్వమేమిటో, నాస్తికత్వమేమిటో మనమెవరమూ ఎరగము. మేమంతా నాస్తికులమేనని నేను అంగీకరించబట్టే నా భార్య మా వాళ్ళను నాస్తికులని చెప్పగలుగుతున్నది. "కాదు, మేము ఆస్తికులమే!" అని నేను నా నోటివెంట అన్నట్టయితే నా భార్య ఏమీ చెయ్యలేదు. వెనకటికి పురాణాలుకూడా ఇటువంటి చిక్కులోనే పడినై. "నాకన్న దేవుడెవడురా కుర్రకుంకా! జగన్నాధుండ, నాకంటె నీ భూతశ్రేణికి రాజు లేడొకడు![1]" అన్న హిరణ్యకశిపుణ్ణి భాగవత కర్త నాస్తికుడన్నాడు. (అంతకంటె చండాలమైన మాటలుకూడా అన్నాడులెండి) "నేనే సమస్త

1. నాకన్న....పోతన మహాభాగవతంలోని సన్నివేశం.

చరాచర ప్రపంచానికి నాథుణ్ణి, మామేవ శరణం వ్రజ"[1] అన్న కృష్ణుణ్ణి భారత కర్త, ఆస్తికుణ్ణి చెయ్యటంతో పోనివ్వక సాక్షాత్తూ ఆ మూల విరాట్టు యొక్క భౌతిక స్వరూపం చేసిపారేశాడు. అట్లాగే "ఇందుగల డందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు"[2] అన్న ప్రహ్లాదుడు నాస్తికుడని నా భార్య అనలేదు గాని, "దేవుడు గుళ్లోనే ఉన్నాడా ఏమిటి? మన ఇంటో లేడూ?" అన్న మా నాన్నను నాస్తికుడనటానికి సందేహించదు. కనక అయ్యా చెప్పలేం!

నిజమయిన ఆస్తికుడికీ నాస్తికుడికీ మత వైషమ్యం ఉండితీరాలి. ఆస్తికుడు నాస్తికుడికి కాళ్ళుకడిగి పిల్లనివ్వడు. నా భార్య నన్ను అన్నివిధాలా ప్రేమతో చూసినా, నాస్తికత్వాన్ని మటుకు తప్పు పట్టటంలో అర్థంలేదు. ప్రపంచంలో ఎంతమంది ఆస్తికులున్నారో అంతమంది భగవంతులున్నారు. ఒకడి భగవంతుడితో ఒకరు తప్పు పట్టటానికి లేదు. ఇప్పుడిప్పుడు మతబుద్ధి నశించి, నాగరికత ప్రబలటంవల్ల ఒక మతం తాలూకు భగవంతుణ్ణి మరొక మతం సహించటం నేర్చుకుంటున్నది—"అంతా ఒకటే! మీరు అల్లా అంటారు, మేం కృష్ణుడంటాం, కిరస్తానీలు క్రీస్తు అంటారు!" అంటే పేరుతో ఏమీలేదని తాత్పర్యం. కాని మన ఆస్తికత్వం అంతటితో ఆగలేదు. మనదేవుడికి వెంట్రుకలు కావాలి, రక్తం కావాలి, లంచాలు కావాలి, దుష్టుడికి దూరంగా ఉన్నట్టు మనం మన దేవుడికి దూరంగా ఉండాలి. మన సామీప్యానికిగాని యీ దేవుడొచ్చాడో మనకేదో ఆపద ఉందన్న మాటే! ఎందుకో తెలియకుండా చెంపలు వాయించుకుని అపరాధం అన్నా— దేవుణ్ణి ఎట్లాగయినా సాగనంపాలి. తిరపతికి పోదామని ఊరికే అనుకోనైనా కూడదు! చెంపలు వాయించుకుని, ముడుపులు కట్టి, కొండలెక్కి, దేవాలయ నిధికి దోచిపెట్టి, సంతర్పణలు చేస్తామని వాగ్దానంచేస్తే అమృతాంజనం అవసరం లేకుండా తలనొప్పి పోతుంది! ఈ పరిస్థితులను సహించగలిగినవాడు ఆస్తికుడు, సహించలేనివాడు నాస్తికుడు!

1. నేనే సమస్త చరాచర.... భగవద్గీతలోని కృష్ణుడు "సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ । అహంత్వా సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి మా శుచః (18వ అధ్యాయం, 66వ శ్లోకం) అనగలిగినవాడు. మహాభారతంలో మానుషధర్మ ప్రవర్తకుడైన ఒక పెద్ద దిక్కుగా, రాజనీతిజ్ఞుడుగా, మనిషిగా కన్పిస్తాడు.

2. చక్రిసర్వోపగతుండు : పోతన భాగవతంలోని "ఇందుగల డందులేఁడని, సందేహము వలదు చక్రిసర్వోపగతుం, డెందెందు వెదికిచూచిన, నందందే గలఁడు, దానవాగ్రణి! వింటే" అన్న పద్యం, ప్రహ్లాదుడు హిరణ్యకశిపునితో అన్నది.

"ఏమండీ! ప్రతిరోజూ మనింటోకూడా భజన చేసుకుందాం?" అన్నాది నాభార్య ఒకనాడు.

"ఇపుడెవరింటో చేసుకుంటున్నారేమిటి?" అన్నాను. నాభార్య కాపరానికి వచ్చిన కొత్తలోనే నేనూ ఆవిడా ఒకవిధంగా రాజీపడ్డాం— ఆవిడ తన యిష్టం వచ్చిన ప్రకారం భగవంతుణ్ణి ధ్యానించుకునేటట్టూ, నేనుమటుకు అందువిషయమై బాధింపబడకుండా ఉండేటట్టూ. ఆ రాజీని అతిక్రమించి నాభార్య నా దగ్గిర దేవుడి విషయమైన ప్రశంస తెచ్చింది కనక ఆవిణ్ణి కొంత ప్రాసింగులో పెట్టటానికి నాకు అధికారం ఉందని నేననుకున్నాను.

నే నడిగినదానికి నాభార్య "పోనిస్తురూ! మనను ఒకళ్ళతో పోటీ ఏమిటీ?" అన్నది. "అయితే 'మనంకూడా' అని ఎందుకన్నావు?—దీన్నే ఇంగ్లీషువాళ్ళు ఆడతర్కం[1]మంటారు."

"ఇంగ్లీషువాళ్ళకు తెలుగు వచ్చునా ఏమిటి?....అదంతా ఎందుకు లెండురూ? మనింటో భజన చేసుకుందాం."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? భజనచేస్తే ఇంటికి వంటికి మంచిది. దుష్టగ్రహాలు ఆసించవు."

"దుష్టగ్రహాలు ఆసించకుండా ఉండటానికి చీనాలో ఏంచేస్తారో తెలుసా? టపాకాయలు కాలుస్తారు. మనంకూడా—"

"ఏమి ఎగతాళండీ! మనం చీనావాళ్ళమూ ఏమిటి? డబ్బు ఏగాని ఖర్చు లేకుండా భజన చేసుకోటానికింత వితర్కిస్తున్నారుగాని టపాకాయలు కొంటారూ?"

"కొంటాను! దేవుణ్ణి భజన చేస్తున్నందుకు కళ్ళు నెత్తిమీదికి వచ్చే వాళ్ళున్నారు. టపాకాయలు కాలిస్తే ఒళ్ళు కాలుతుందేమో కాని కళ్లు నెత్తిమీదికి మాత్రం రావు."

నా భార్య నావంక చాలసేపు విచారంతో చూసి, "నేను అడిగినదానికీ, మీరు మాట్లాడే దానికీ ఏమైనా సంబంధం ఉందీ? రెండక్షరాల్లో చెప్పేదానికి ఇంత రభస ఎందుకు చెప్పండి!" అన్నది.

"సరే నీ యిష్టం— నీ పిల్లల యిష్టం! నేనుమాత్రం భజన చెయ్యను. మీరు నాకు ఏనాడు అడ్డం వస్తే ఆనాడు ఇది ఆపుచేస్తాను!" అన్నాను.

ఎటుపోయి ఎటువచ్చినా మంచిదని నా భార్య నాకేమీ జవాబు చెప్పలేదు.

ఆరోజునించీ మాయింటో భజన ప్రారంభమయింది. మా పిల్లలు నలుగురూ

---

1. ఆడతర్కం : స్త్రీలకు పెడబుద్ధి తప్పదని సూచించే Women's logic అనే మాటకు తెలుగు.

భజనలు చేసేవాళ్ళ దగ్గిరికివెళ్ళి కీరపాండురంగ భజన కీర్తనలు[1] నేర్చుకోసాగారు. మా ఆవిడకూడా వడ్డించేటప్పుడూ, వంటచేసేటప్పుడూ, కసువు వూడ్చేటప్పుడూ— కీచుగొంతుతో ఆ కీర్తనలు మననం చేసుకోవటం వింటూండేవాణ్ణి.

మాయింటో భజన చెయ్యటానికి అనుజ్ఞ యిచ్చిన వారంరోజులకు నేను నా భార్యతో అన్నాను.

"ఏమే ఇవాళ వెంకట్రావు బందరునించి వచ్చాడు, కనిపించాడు—"

"వెంకట్రావంటే కాంతమ్మ మొగుడా? నల్లగా పొట్టిగా అసహ్యంగా ఉండే ఆయన!" అని నా భార్య నాకు అడ్డం వచ్చింది.

"సరేలే! అసలు సంగతి విను. ఈ భజనలు మొదలుపెట్టిన తరవాత వాళ్ళింటో మాణిక్యంవంటి వెండి గిన్నె పోయిందిట! నామాట విను. ఈ భజన ఎందుకు? మానెయ్యి!"

"చాల్లెండి! భజన చెయ్యటమేమిటి, వెండిగిన్నె పోవటమేమిటి? నేనేం తెలివి తక్కువ దద్దమ్మ ననుకున్నారా? కావలిస్తే ఆయన్నదంతా కథ రాయమనండి!"

"అప్పుడు నమ్మదగినట్టుగా ఉంటుందేం? ఎంత కష్టపడి రాసినా నేను రాసే కథలు నమ్మదగినట్టుగా ఉండవు! కామా? పోనీ, నాకేం? నీ యిష్టం!"

ఒకనాడు మా పెద్దమ్మాయి నా దగ్గిరికివచ్చి, "నాన్నా, నాన్నా! 'పాండు రంగప్రభో!'[2] పాటకు స్వరంచేసి పెట్టవూ? నేను హార్మనీమీద వేసుకుంటా నాన్నా!" అని గంతులు వేసింది. అది మాండ్ రాగంమీద ఒక మరాఠీ కీర్తనకు అనుకరణం. ఆ కీర్తనకు స్వరంవేసి, నేను వాయించి, మా పెద్దపిల్లచేత వాయింపించటం పూర్తిగా ఒకపూట పని అయింది. ఆరోజు సాయంకాలం నేను బయటికి పోతుండగా మా రెండోపిల్ల తనకు సరిగమలు నేర్పమని అర్జీ పెట్టుకుంది. రేపు చూస్తాను లెమ్మని నా దారిన నేను వెళ్ళాను.

ఆ రాత్రి పెద్దది తప్ప మిగిలిన ముగ్గురూ నా దగ్గిరికివచ్చి ఫిర్యాదు చేశారు— మా పెద్దది భజనకు హార్మోనిస్టు పనిచేసి భజన యావత్తూ తగలవేసిం దట. ఆ విషయమై తీర్పు నావల్ల కాదని పిల్లలకు నచ్చచెప్పటానికి నాకు ఒక గంట పట్టింది.

మరొకనాడు మా పెద్దపిల్లను ఎవరో శ్లాఘించారుట, భజన చేస్తుంటే విని— "చక్కాముది ఏం వరహాల గొంతే! అది పాడుతుంటే అంతా సినిమాలో పాడి నట్టుంటే!" అని.

---

1. కీరపాండురంగ కీర్తలు : 1919లో వెలువడిన వి. శి. బాబురావు పాండు రంగ కీర్తనలు పుస్తకంలోనివేమో.

2. పాండురంగప్రభో : పాండురంగ భజనపాట పాదం.

దాని ఫలితం, మిగిలిన ముగ్గురు పిల్లలూ దానిమీద సత్యాగ్రహంపూనారు. దానితో కలిసి పాడారు. అది ఒక చరణం పాడితే వీళ్ళు మరొక చరణం పాడతారు. ఆఖరుకు గొంతులన్నా శ్రుతిలో కలపరు. అది త్వరగా పాడితే వీళ్ళు మెల్లిగా పాడతారు.

ఇక పెద్దది అపర నారదుడై పోయింది. అది మేలుకుని ఉందంటే పాడుతూ ఉందన్నమాటే. ఎవరన్నా దాన్ని పలకరిస్తే పాడుతూనే "ఏం కావాలి?" అన్నట్టు తల ఊపుతుంది. వాళ్ళడిగినదానికి అవుననో, కాదనో, తనకు తెలియదనో, అంతేనో పాడుతూనే సంజ్ఞచేస్తుంది తల ఊపుతో. అది దొడ్లో ఏ మూలో పాడుతూ ఉంటే, నా భార్య దేనికయినా కేక పెడితే అది పాట ఆపి "ఓయ్" అనకుండా, పాడుకుంటూ తల్లిదగ్గిరికివచ్చి పాడుతూ నిలుచుంటుంది.

నా భార్యకు ఒళ్ళుమండి దాన్ని ఏదోవిధంగా మాట్లాడేటట్టు చేస్తుంది. మా పెద్దది కోపం పట్టలేక "ఏం ఓర్వలేనితనమే, తల్లీ!" అని చెప్పి సమాధానం చెప్పకుండా మళ్ళీ పాడుకుంటూ వెళ్ళిపోతుంది.

రెండు మూడు రోజులపాటు నా భార్య పెద్దదాని కూనిరాగం వినపడ్డప్పడల్లా, "అబ్బ! తలపట్టి పోతున్నది. తండ్రీ— దీని కూనిరాగాలతో!" అని నాకు వినపడేటట్టు విసుక్కునేది. ఇది ఎట్లాగూ నాదాకా వచ్చే సంగతేనని ఊహించి నేను జోక్యం కలిగించుకోలేదు.

ఆఖరుకు నా భార్య నా దగ్గిర ఫిర్యాదు చేసింది—పిల్లలందరిమీదా కూడా! అంతా విని నా తీర్పు చెప్పసాగాను.

"ముందు పెద్దదాని సంగతి విచారింతాం. అది రోజల్లా పాడుతుందంటావు. పాట ఆపిస్తే దెప్పుతుందంటావు.అది పాడేది మీరు భజనచేసే కీర్తనలేనా? ఇంకేం? అది రోజల్లా భజన చేస్తున్నది. ఇందులో తప్పేముందీ? వెనకటికి నారదుడూ ఇంతే— రోజల్లా పాడుతూనే ఉండేవాడు. పాడటం మానేకావో, ఎవరికో తంపులు పెట్టాడన్న మాటే!అందుకని దేవతలంతా నారదుణ్ణి నీవంటి భక్తుడు లేడని ఉబ్బించి, ఆ ముండాకొడుకును రోజల్లా పాడేటట్టు చేస్తుండేవాళ్ళు. నువు కూడా పెద్దపిల్ల విషయంలో అట్లాగే చెయ్యి—ఇంటికీ వంటికీ మంచిది. ఇక రెండో దాని సంగతి—"

కాని నా భార్య రెండో దాని విషయంలో నా తీర్పు వినడానికి ఆగలేదు, ముద్దుగా మొహం చిట్లించుకుని నా దగ్గిరనించి అవతలికి వెళ్లిపోయింది.

తరవాత వారం రోజులదాకా నా భార్య నా సహాయం అపేక్షించలేదు. భజనలు జయప్రదంగా లేవని నేను ఊహించగలిగాను.

ఆఖరుకు నా ఆవిడ నాతో రాజీకి వచ్చింది.

"ఒక్కనాడు మీరు మేం భజన చేసేటప్పుడు దగ్గిర ఉండండి. ఈ కొంచెపు లది నా మాటంటే బొత్తిగా లక్ష్యం చేయటంలేదు! రెండు రోజులు మేము భగవ

ఉండి వాళ్ళచేత భజన చేయిస్తే ఇంత అల్లరి ఉండదు. వాళ్ళకు మీరంటే గుట. నాలుగైదు రోజులు ఓపిక పట్టారంటే ఆ తరవాత పీడ మా చాయలకు రాకుం డానే పని జరిగిపోతుంది—"

ఆవిడను ఈ విధంగా మాట్లాడనిస్తే ఒక రోజు కాస్తా నెలలూ, సంవత్స రాలూ అయిపోతుందని, "ఈ విషయం మాత్రం నన్ను బాధించకు" అన్నాను. ఆవిడకు అర్థం వచ్చి.

"నా మాట వినరూ? పండు కామా?"

"కాదు !"

"చూడారూ?"

"చూడను!"

నా భార్య పాశుపతం ప్రయోగించింది — నా దగ్గిర కూర్చుని నా తల నిమురుతూ "ఇంత బతిమాలుతుంటే ఒప్పుకోక పోవటానికి మీకు నోరెట్లా వస్తున్న దండీ!" అన్నది.

సరే, ఆ సాయంకాలం మా యింటో భజనకు నేను అతిథిని. మావాళ్ళు ఆనాడు చేసినది భజన కాదు కోలహాలం. ఏ చిన్న విషయంలోనూ నా భార్యా పిల్లలు ఒకరిలో ఒకరు ఏకీభవించలేదు. భగవంతుడి సాన్నిధ్యంలో అందరూ ఒకటే నన్నది నేనానాడు ప్రత్యక్షంగా చూశాను — భజన దగ్గిర మావాళ్ళంతా మా పసి దానితో సమానమైనారు.

ముందు మా పెద్దపిల్ల హార్మోనియం తెచ్చి దగ్గిర పెట్టుకుని కూర్చున్నది. ఆ తరవాత మిగిలిన నలుగురూ చేరారు. "పాండురంగని భజనకు బోవా భక్తు లందరు రారమ్మా[1]" అనే కీర్తన ప్రారంభించారు. మా పెద్దది విడిగా హార్మోనియం వాయిస్తేనే చెప్పతరం కాకుండా ఉంటుంది. దానికి పడ్డచోట త్వర త్వరగా వాయించి పడని చోట్ల ఏకుపింజ తీసినటు సాగతీసి వాయిస్తుంది. ఇక నలుగుర్తో కలిసి పాడే భజనలో అది హార్మోనియం వాయించటం ఎట్లా ఉంటుందో చెప్పనవ సరం లేదు. మధ్య మధ్య దాని చేతికి తప్పు మెట్లు కూడా తగులుతూ ఉంటై. ఇది జరిగినప్పుడల్లా మా రెండోది ఆడ టార్జాను[2] కేక పెట్టినట్లు కేక పెడుతుంది. అప్పుడు మా మూడోది కడుపారా నవ్వుతుంది.

నా భార్యా పిల్లల్ని కసిరిన మీదట మళ్ళీ భజన సాగుతుంది. మా రెండోదీ మూడోదీ వాళ్లకు జ్ఞాపకం వచ్చిన చరణాలు వాళ్ళ యిష్టం వచ్చిన శ్రుతుల్లో పాడతారు.

---

1. పాండురంగని భజనకు....పాండురంగ భజనపాట పాదం
2. ఆడ టార్జాను : అసాధ్యశమైన బలిమి, పౌరుషంగల ఆటవికుడైన టార్జాన్ వంటి శక్తిగల స్త్రీ.

నేను చూసిన నాటికి భజన దీనికిందికి తేలింది — మా పెద్ద పిల్ల ప్రాథానికి తన సంగీతంపాడే నేర్పు ప్రకటించే పాటకచ్చేరీ, రెండోదానికీ మూడోదానికీ అల్లరిచేసే అవకాశం, మా నాలుగోదానికి చాటుగా ప్రసాదం పొదం చేసే అవకాశం, నాభార్యకు పిల్లలమీద తను అధికారం చలాయించే అవకాశం. ఇందులో ఎవరికీ జయం చేకూరక పోవటాన మా యింటి భజన ఏ విధంగానూ రక్తి కట్టక పోయింది.

నా భార్య ఎన్నడూ పిల్లల్ని కొట్టదు. ఆనాడు వాళ్ళంతా తన్ను నా ఎదట పరాభవించటం సహించలేక, నా మాట వినక తను ప్రారంభించిన భజన యిట్లా పరిణమించటం నేను కళ్లారా చూశానన్నది తెలుసుకుని, పట్టలేక పిల్లందర్నీ తలా ఒకదీ పెట్టింది. ఆనాటికి భజన ఆఖరయింది.

మా ఆవిడ మనస్సు కష్టపడుతున్నదని గ్రహించి, నేను, "నువ్వెందుకు, పాపం, వృథాగా హైరాన పడతావు? దేవుడి దగ్గిర పిల్లలకు అల్లరి చేసేటందుకూ, నవ్వేటందుకూ అధికారం లేకపోతే ఇంకెవరికుంది? భజన అంటూ పెట్టినదానివి నీ యిష్టం వచ్చినట్టు నువ్వు చెయ్యి. వాళ్ళ యిష్టం వచ్చినట్టు వాళ్లను గోల చెయ్యనీ! భజనవల్ల మనస్సుకు కాస్త శాంతి రావాలి కాని వ్యథ కలిగితే ఎట్లా?" అని బోధించాను.

"అయితే మానేలెండి!" అన్నది నా భార్య కళ్ళనీళ్ళ పర్యంతమయి.

అభిమానవతి, ఎగతాళి చేస్తే దారికి రాదని ఆ రాత్రి నా భార్యను బుజ్జగించి మంచి చేసుకుని ఒక సలహా చెప్పాను.

"నా మాట విని వారం రోజులపాటు ఈ భజన ఆపేసెయ్యి. ఆ తరువాత నేను వీళ్ళను ఎట్లాగైనా దారికి తెస్తాను," అన్నాను.

"ఈ రాక్షస సంతానంతో భజనలు కాదు" - అని మా ఆవిడ మిగిలినది నా ఊహకు వదిలి వేసింది.

అయితే నేను చెప్పిన సలహా జయప్రదంగా పనిచెయ్యలేదు. మా ఆవిడ భజన మానేసినా మా పిల్లలు మాత్రం మానలేదు. యథా సమయానికి వీళ్ళంతా చేరి మామూలు ధోరణిలోనే భజన ప్రారంభించారు. తల్లి దగ్గిరకూడా లేదేమో, వాళ్ళా రోజున చేసిన ఆగం అంతా యింతా కాదు. వ్యవహారం ముదురుతున్నదని తోచగానే నేను భజన ఆపుదల చేయించి భోజనాలు పెట్టించాను. ఈ విధంగా రెండు మూడు రోజులు జరిగిన తరవాత మా ఆవిడ "వీళ్లఅల్లరి ఎట్లాగైనా మానిపింతురూ! పొద్దుకనివ్వరు. తల పట్టి పోతున్నది," అన్నది నాతో.

ఆనాటితో నా భార్య నాకు సొంతంగా ఓడిపోయింది. మళ్ళీ ఎన్నటికీ యిటువంటి ఎత్తు ఎత్తనని ఆవిడచేత వాగ్దానం చేయించుకుని మా పిల్లల చేత యీ అల్లరి మానిపించాను. దానికి నేను చేసిందేమిటంటే ఒక గ్రామ ఫోనూ నాలుగు రికార్డులూ తెచ్చి ఇంటో పెట్టాను. మా పిల్లలు అల్లరి పిల్లలు కావచ్చుగాని అందరూ సంగీత

మంటే చెవి కోసుకుంటారు. సాయంకాలంపూట నేను పిల్లల్నందర్నీ చుట్టూ కూర్చో పెట్టుకుని ఆ నాలుగు రికార్డులు మోగించేవాణ్ణి.

అంతటితో నా భార్యకు భజన పిచ్చి వదిలింది. వదిలిందనుకున్నాను. ఎందు చేతనంటే ఆ మధ్య ఒకనాడు మా ఆవిడ నాతో, "ఏమండీ, విన్నారూ? ఈ మధ్య మనింటి పక్కన ఉండే వాళ్ళే, వాళ్ళ పిల్ల మూగది, కుసుమ హరనాథ్ జపం చేస్తే నోరు వచ్చింది. రోజూ వెయ్యిసార్లు 'కుసుమ హరనాథ్' అనుకునేదిట!.. మనింటో ఏమీలేదూ! అంటే, నేను, "మూగది జపం చెయ్యటం వింతకంటె మూగదానికి నోరు రావటం వింత ఏ విధంగా ఎక్కువ? మనస్సులో చేసిందంటావా? నువ్వు కూడా రోజుకు పదివేలసార్లు మనస్సులో కుసుమ హరనాథ్! అనుకో. మళ్ళీ భజన అంటూ పెట్టకు, నీ పుణ్యముంటాయిది!" అన్నాను. "ఆ కీర్తనలు ఎంత బాగుంటయ్యాను కున్నారు!" అన్నది. నేను 'ససేమిరా' అన్నాను. నా భార్య నిట్టూర్చి, "పోని వ్వండి గీతలో లేకపోతే ఏం చేస్తాం?" అని సరిపుచ్చుకుంది. ఇక ఎప్పటికీ ఆవిడ భజన ఊసెత్తదుకదా అని నేను దిగులు కూడా పడ్డాను—అర్థం లేకుండా.

కాని నిన్ననంటే నిన్న సాయంకాలం మా ఆవిడ బజారుకు బయలుదేరి నన్ను వెనక్కి పిలిచి, "ఏమండోయి! జ్ఞాపకం పెట్టుకుని గ్రామఫోను షాపులో రండయ్యా, రండయ్యా[1], రికార్డు తీసుకురండి! మరచిపోకండి" అని హెచ్చరించింది

—ముద్రణ : భారతి, మే 1938

1. రండయ్యా, రండయ్యా భజనకీర్తనకర్త తెలియదు.